సాక్షి ఆదిలాబాద్

మంగళవారం । 16 । జూలై । 2024

ఫ్రీజింగ్ ఎత్తివేయాలి

ఆదిలాబాద్‌టౌన్: తమ డబ్బులు ఇప్పించడంతో పాటు అకౌంట్‌పై ఉన్న ఫ్రీజింగ్ ఎత్తివేయాలని రైతులు డిమాండ్ చేశారు. హెడ్ పోస్టాఫీస్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఇటీవల పోస్ట్‌పేమెంట్ బ్యాంక్ మేనేజర్ సీసీఐ ద్వారా రైతులకు వచ్చిన పత్తి డబ్బులు కాజేశాడని పేర్కొన్నారు. సదరు మేనేజర్ రైతుల అకౌంట్‌లో డబ్బులు వేయడంతో వాటిని పోలీసులు ఫ్రీజింగ్ చేయించారన్నారు.

నేడు సీఎం సమీక్షకు కలెక్టర్, ఎస్పీ

కైలాస్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షకు నిర్వహించనున్నారు. సచివాలయంలో నిర్వహించనున్న సమావేశానికి కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం హాజరు కానున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా యంత్రాంగంతో కలెక్టర్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల తీరుతెన్నులపై సంబంధిత అధికారులతో చర్చించారు.

గరిష్టం/కనిష్టం
31.0/20.0

వాతావరణం

పలుచోట్ల ఓ మోస్తరు భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీల ఆందోళన



నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

ఆదిలాబాద్‌టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు సోమవారం ఆందోళన చేపట్టారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగన్ వాడీల శ్రమను అగౌరవపర్చేలా ఉన్న జీవో వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇంకా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ప్రజాప్రతినిధులు అసెంబ్లీ, పార్లమెంట్‌లో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో సంఘం అధ్యక్షురాలు వెంకటమ్మ, సునీత, పార్వతి, అనసూయ, పద్మ, విశాఖ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.

అధికారులు క్షేత్ర పరిశీలన చేయాల్సిందే..

- కలెక్టర్ రాజర్షిషా

కైలాస్‌నగర్: జిల్లాలోని అన్ని శాఖల డివిజన్, మండల, గ్రామస్థాయి అధికారులు విధిగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయా శాఖల జిల్లా అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, పాఠశాలల పనితీరు, పీడీఎస్ బియ్యం, పింఛన్ల పంపిణీ, మహిళా శక్తి తదితర కార్యక్రమాలను పర్యవేక్షించి ప్రతినెల 5వ తేదీ లోపు కలెక్టరేట్ ఏవోకు టూర్ డైరీతో కూడిన నివేదిక అందజేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడంతో పాటు తమ పరిధిలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ప్రజాపాలన కేంద్రాలు, సంక్షేమ వసతిగృహాలను సందర్శించాలని పేర్కొన్నారు. ఉద్యోగుల బదిలీల ప్రక్రియను ఎలాంటి విమర్శలకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహాన్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, ఉపాధ్యాయులు లేని పాఠశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన వీవీలను నియమించాలని పేర్కొన్నారు. అలాగే స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం చేసిన వారిపై విచారణ జరిపి సీసీఏ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి గోపీకృష్ణ, బాధ్యులు నారాయణ, గోమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18న ఎంపీవోల బదిలీ కౌన్సెలింగ్

కైలాస్‌నగర్: జిల్లా పంచాయతీ శాఖలో పనిచేసే మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 18న కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత తెలిపారు. 17మంది ఎంపీవోలకు గాను ఏడుగురు తప్పనిసరిగా బదిలీ కానున్నట్లుగా పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శుల్లో గ్రేడ్-1 ఒకరు, గ్రేడ్-2 నలుగురు, గ్రేడ్-3లో 40మంది, గ్రేడ్-4లో 128 మందికి తప్పనిసరిగా స్థానచలనం కలగనుంది. ఇప్పటికే వారంతా బదిలీలకు ఆప్షన్ అందించారు. ఈ మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 11గంటలకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు.

మాఫీపై స్పష్టత

- రుణమాఫీ మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం
- రూ.2లక్షల వరకు వర్తింపు
- కుటుంబం ప్రాతిపదికన..
- ఆహార భద్రత కార్డు ప్రామాణికం
- 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు బకాయిలకు మాత్రమే..



జిల్లాలో పట్టా పాస్‌బుక్ ఉన్న రైతులు : 1.47లక్షలు	అకౌంట్ ఉన్న రైతులు: 1లక్ష 17వేలు	రుణమాఫీ అయ్యే నిధులు: దాదాపు రూ.800 కోట్లు

ఆదిలాబాద్‌టౌన్: పంట రుణమాఫీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతకు తీపికబురు అందించింది. ఈ మేరకు సోమవారం మార్గదర్శకాలు విడుదల చేసింది. కుటుంబం ప్రాతిపదికన రూ.2లక్షల వరకు వర్తింపజేయనున్నట్లు పేర్కొంది. ఇందుకోసం రేషన్‌కార్డును ప్రామాణికంగా నిర్ణయించింది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు బకాయిలకు మాత్రమే అని స్పష్టం చేసింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ హామీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా విధివిధానాలు ప్రకటించింది. రుణమాఫీ నిధులను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేయనుంది. నిర్దేశిత గడువు లోపు వాటికి మాత్రమే వర్తిస్తుందని, రీషెడ్యూల్ చేసిన రుణాలకు వర్తించదని మార్గదర్శకాల్లో పేర్కొంది. అయితే జిల్లాలో ఎంత మంది రైతులకు రుణమాఫీ వర్తింస్తుందనే వివరాలు ఇంకా అధికారుల వద్ద అందుబాటులో లేవు. సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక పోర్టల్ సైతం ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

జిల్లాలో..

జిల్లాలో 1లక్ష 47వేల మంది రైతులకు పట్టా పాస్‌బుక్‌లు ఉన్నాయి. వీరిలో 1లక్ష 17వేల మంది రైతులకు ఆయా బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నాయి. అయితే ఒక్కో రైతు ఒక్కో బ్యాంకు నుంచి రూ.10వేల నుంచి రూ.1లక్ష, రూ.2లక్షల వరకు రుణాలు పొందారు. ఏ రైతు ఎంత రుణం తీసుకున్నారనే వివరాలు లీడ్ బ్యాంక్ అధికారుల వద్ద కానీ, వ్యవసాయ శాఖ అధికారుల వద్ద లేవని చెబుతున్నారు. ఉన్నతాధికారుల నుంచే రైతుల రుణమాఫీ వివరాలు వస్తాయని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. రుణమాఫీకి సంబంధించి 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు రుణం తీసుకున్న వారి బకాయిలను మాత్రమే ప్రభుత్వం మాఫీ చేస్తుంది. అయితే ఒక కుటుంబంలో రూ.2లక్షల వరకు మాత్రమే వర్తించనుంది. కుటుంబ సభ్యులందరిని కలిపి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మాఫీ చేయనున్నారు. చిన్న మొత్తంవి తొలుత పూర్తి చేసి తర్వాత వరుస క్రమంలో మిగతావి మాఫీ చేయనున్నట్లు తెలుస్తోంది. రూ.2లక్షలకు పైబడిన రుణాలకు సంబంధించి నిర్దేశిత మొత్తం మినహాయించి మిగతాది రైతులు చెల్లించాల్సి ఉంటుంది. ఉదాహరణకు రూ.2.50లక్షలు రుణం ఉంటే రైతు రూ.50వేలు చెల్లించాల్సి ఉంటుంది. రెన్యూవల్ చేసిన వాటికి ఈ పథకం వర్తించదు. పీఎం కిసాన్ జాబితాను రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ, జిల్లా సహకార బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న రైతులకు మాఫీ వర్తిస్తుంది.

నిబంధనలు ఇవీ..

రాష్ట్రంలో భూమి కలిగిన ప్రతి కుటుంబానికి రుణమాఫీ వర్తిస్తుంది. ఈ పథకం స్వల్పకాలిక పంట రుణాలకు ఇవ్వనున్నారు. షెడ్యూల్, వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార బ్యాంకులు వాటి బ్రాంచీల్లో రైతులు తీసుకున్న రుణాలకు ఈ పథకం వర్తిస్తుంది. రైతు కుటుంబంలో పౌరసరఫరాల శాఖ వారు ఇచ్చిన ఆహార భద్రత కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నారు. రైతులు ప్రభుత్వానికి తప్పుడు సమాచారం ఇచ్చి రుణమాఫీ పొందితే వారి నుంచి రికవరీ చేయనున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ట్యాక్స్ చెల్లించే వారికి రుణమాఫీ వర్తించే విషయంలో ప్రభుత్వం సమాలోచన చేస్తుంది. దీనికి సంబంధించి మార్గదర్శకాల్లో పేర్కొనలేదు.

సంతోషంగా ఉంది



ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేయడం సంతోషంగా ఉంది. త్వరగా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవడం హర్షనీయం.

– ఎంబడి స్వామి, రైతు, మావల

విధివిధానాలు సరిగా లేవు



రుణమాఫీకి సంబంధించిన విధివిధానాలు సరిగా లేవు. జాప్యం జరిగే అవకాశం ఉంది. రైతులకు త్వరగా రుణమాఫీ చేసి డబ్బులు అందేలా చూడాలి. కుటుంబంలో ఒకరికి కాకుండా రుణం తీసుకున్న వారందరికీ వర్తింపజేయాలి. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలి.

– నర్సింగ్, రైతు, పిప్పల్‌కోటి, భీంపూర్ మండలం

అందరికీ న్యాయం జరగాలి



రుణామాఫీపై మార్గదర్శకాలు విడుదల చేయడం సంతోషంగా ఉంది. అయితే ఎప్పటివరకు రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తారో ప్రభుత్వం ప్రకటించాలి. గత ప్రభుత్వం విడతల వారీగా రుణమాఫీ చేసిన విధంగా కాకుండా ఒకేసారి అందించాలి. జాప్యం చేయకుండా ఇచ్చిన హామీ నెరవేర్చాలి.

– దోనిపెల్లి స్వామి, రైతు, గురుజ, గుడిహత్నూర్

అవిశ్వాసానికి హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

- ఈనెల 18న ప్రత్యేక సమావేశం
- బీఆర్‌ఎస్, బీజేపీ కౌన్సిలర్లలో గట్టి ధీమా
- అధికార పార్టీలోనూ సడలని ధైర్యం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ అవిశ్వాస ప్రక్రియ నిర్వహణకు రాష్ట్ర హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. బీఆర్‌ఎస్, బీజేపీ కౌన్సిలర్లు కలెక్టర్ రాజర్షిషాకు అందించిన అవిశ్వాస తీర్మానంలోని సంతకాలపై సందేహాలు వ్యక్తం చేసిన వైస్‌చైర్మన్ జహీర్ రంజాని హైకోర్టును ఆశ్రయించారు. అవిశ్వాస ప్రక్రియ వాయిదా వేయాలని కోరారు. దీంతో ప్రత్యేక సమావేశం ఉంటుందో లేదోనని నోటీసు ఇచ్చిన కౌన్సిలర్లతో పాటు రాజకీయ, అధి కార వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. వైస్‌చైర్మన్ వేసిన పిటిషన్‌ను కొట్టేసిన కోర్టు ప్రత్యేక సమావేశ నిర్వహణకు అనుకూలంగా తీర్పునిచ్చినట్లుగా అధికారులు చెబుతున్నారు. దీంతో ముందుగా ప్రకటించినట్లుగానే ఈ నెల 18న నిర్వహించనున్న ప్రత్యేక సమావేశానికి లైన్‌క్లియర్ అయింది. దీంతో బల్దియా అధికారులు సమావేశ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అవిశ్వాసం వీగుతుందా, నెగ్గుతుందా అనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

క్యాంపు బాటలో బీఆర్‌ఎస్..

బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ గూటికి చేరిన వైస్‌చైర్మన్ జహీర్ రంజానిని ఎలాగైన పదవీ నుంచి దించాలని ఆ పార్టీకి చెందిన ఓ మాజీ ప్రతినిధి పట్టుదలతో ఉన్నట్లుగా సమాచారం. ఇందుకోసం ఆ పార్టీ కౌన్సిలర్లతో అవిశ్వాస లేఖ ఇప్పించిన సదరు నాయకుడు అందుకు బీజేపీ కౌన్సిలర్ల మద్దతు కూడగట్టడంపై దృష్టి సారించి వారిని సైతం ఒప్పించినట్లుగా చర్చ సాగుతోంది. సదరు మాజీ ప్రజాప్రతినిధి ప్రోత్సాహంతోనే ముందడుగు వేసిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఓ అసమ్మతి కాంగ్రెస్ కౌన్సిలర్‌తో కలిసి బీజేపీతో సహా 33 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన అవిశ్వాస లేఖను ఇటీవల కలెక్టర్‌కు అందజేశారు. దాన్ని పరిశీలించి కమిషనర్ నుంచి వివరాలు సేకరించిన కలెక్టర్ ఈ నెల 18న ఆర్డీవో ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే దీన్ని సవాలుగా తీసుకున్న అధికార పార్టీ ముఖ్య నాయకుడు ఎలాగైనా అవిశ్వాసం వీగిపోయేలా చేయాలని భావించారు. ఇందుకోసంబీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు గాలం వేసి పార్టీలోకి ఆకర్షించేలా పావులు కదిపారు. సదరు నాయకుడి వ్యూహాలకు అనుగుణంగా పది మంది కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌ను వీడి హస్తం పార్టీలో చేరారు. అధికార పార్టీలోకి వరుసగా కౌన్సిలర్ల చేరికలు కొనసాగుతుండటంతో ఇబ్బందికర పరిస్థితి తలెత్తవచ్చని భావించిన సదరు మాజీ ప్రజాప్రతినిధి బీఆర్‌ఎస్ కౌన్సిలర్లను కాపాడుకునే చర్యలు చేపట్టారు. ఆపార్టీ కౌన్సిలర్లు అధికార పార్టీ నాయకులకు చిక్కకుండా ఉండేలా క్యాంపులకు తరలించారు. ప్రస్తుతం క్యాంపులో ఉన్న కౌన్సిలర్లతో పాటు బీజేపీ కౌన్సిలర్లు, ఎమ్మెల్యే మద్దతుతో వారికి అవిశ్వాసానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ ఉన్నట్లు తెలుస్తోంది.దీంతో ఎలాగైనా తాము అవిశ్వాసం నెగ్గుతామని బీఆర్‌ఎస్, బీజేపీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

ఆకర్ష్ పైనే అధికార పార్టీ ఫోకస్..

అధికార పార్టీ నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకుడు సైతం ఈ అవిశ్వాసాన్ని సవాలుగా తీసుకొని ఆపరేషన్ ఆకర్ష్ వేగవంతం చేశాడు. ఆయన వ్యూహాలకు అనుగుణంగా బీఆర్‌ఎస్ నుంచి వరుసగా కౌన్సిలర్ల చేరికలు జరిగాయి. జూనియర్లతో పాటు పలువురు సీనియర్ కౌన్సిలర్లు ఆపార్టీని వీడి హస్తం గూటికి చేరారు. మరోఇద్దరిని లాగితే అవిశ్వాస గండం నుంచి గట్టెక్కవచ్చని భావించారు. ఈ క్రమంలో సదరు నాయకుడికి బీఆర్‌ఎస్ ఝలక్ ఇచ్చింది. మిగతా కౌన్సిలర్లు ఆపార్టీ వలకు చిక్కకుండా క్యాంపులకు తరలించింది. అయితే కాంగ్రెస్ కండువా కప్పుకున్న ముగ్గురు కౌన్సిలర్లు ప్రస్తుతం బీఆర్‌ఎస్ క్యాంపులో ఉన్నట్లుగా రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. వారితో కలుపుకుంటే అవిశ్వాసం సునాయసంగా బీఆర్‌ఎస్, బీజేపీలు నెగ్గుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇది కాంగ్రెస్‌కు ఊహించని షాక్‌గా మారడంతో వారు బీజేపీ కౌన్సిలర్లపై గురిపెట్టారు. ఇందులో భాగంగానే ఆదివారం దొడ్డన్న అనే కౌన్సిలర్‌ను ఆ పార్టీలో చేర్చుకోవడంతో గందరగోళానికి దారితీసింది. అనంతరం సదరు కౌన్సిలర్ తిరిగి సొంత గూటికి చేరడం గమనార్హం. ఈ పరిణామాల నేపథ్యంలో అవిశ్వాసం నెగ్గుతుందని బీఆర్‌ఎస్, బీజేపీలు గట్టి ధీమాతో ఉండగా అధికార పార్టీ నాయకులు సైతం అదే ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అవిశ్వాస సమావేశ నిర్వహణకు మున్సిపల్ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

క్యాంపునకు తరలిన కాంగ్రెస్ కౌన్సిలర్లు



కారులో బయలుదేరిన కాంగ్రెస్ కౌన్సిలర్లు

బీఆర్‌ఎస్ బాటలోనే కాంగ్రెస్ కౌన్సిలర్లు పయనిస్తున్నారు. తాజాగా సోమవారం అధికార పార్టీ కౌన్సిలర్లు క్యాంపునకు బయల్దేరి వెళ్లారు. స్థానిక ప్రజాసేవ భవన్‌లో కంది శ్రీనివాసరెడ్డితో సమావేశమైన 11 మంది కౌన్సిలర్లు వైస్ చైర్మన్ జహీర్ రంజానితో కలిసి రెండు ప్రత్యేక వాహనాల్లో క్యాంపునకు తరలివెళ్లారు. వారి వెంట పలువురు అధికార పార్టీ నేతలు కూడా ఉండడం ప్రాధాన్యత సంతరించుకుంది.

మళ్లీ రైల్వే సర్వే!

- ఆదిలాబాద్ నుంచి పటాన్‌చెరు వరకు..
- గతేడాది ప్రతిపాదించిన కేంద్రం
- గతంలో పలుమార్లు సర్వేలు
- ఈసారైనా కొలిక్కి వచ్చేనా..?



నిర్మల్:నిర్మల్ ప్రాంతం మీదుగా హైదరాబాద్–ఆదిలాబాద్ రైల్వేలైన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ దశాబ్దాలుగా నలుగుతోంది. చాలాసందర్భాల్లో ప్రజాప్రతినిధులు ప్రయత్నం చేస్తూ వచ్చారు. ఢిల్లీ వరకు వెళ్లి కేంద్రానికి వినతులు అందించి, సంప్రదింపులూ జరిపారు. కానీ.. రైల్వేలైన్‌లో అడుగు కూడా ముందుకు పడలేదు. ఈ లైన్ నిర్మాణంలో ఎన్నో మలుపులు తిరుగుతూ.. చివరకు గత ఏడాది సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. అందులో భాగంగానే తాజాగా మరోసారి సర్వే మొదలైంది. గతంలో జిల్లాకు రైలు వస్తుందన్న ఆశలు రేకెత్తించేలా ఎన్నో సర్వేలు చేశారు. కానీ.. ఇప్పటికీ రైలు రాలేదు.

ఫలించని ప్రయత్నాలు..

1991లో పీవీ నర్సింహారావు ప్రభుత్వం కేంద్రంలో ఉన్నప్పుడు ఆదిలాబాద్ ఎంపీగా ఉన్న అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి నిర్మల్ మీదుగా రైల్వేలైన్ వేయాలని కోరారు. కేంద్రమంత్రిగా చేసిన వేణుగోపాలచారి సైతం ప్రయత్నం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం సగం వాటా భరిస్తుందంటూ అప్పటి సీఎం కేసీఆర్ రాసిచ్చిన ఒప్పందాన్ని తీసుకుని అప్పటి ప్రజాప్రతినిధులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జోగురామన్నతోపాటు అప్పుడు, మళ్లీ ఇప్పుడు కూడా ఎంపీగా ఉన్న నగేశ్ సైతం ఢిల్లీకి వెళ్లారు. కేంద్రంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ..రాష్ట్రప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం వాటా మాత్రం ఇవ్వకపోవడంతో ఆ ప్రయత్నం మరుగున పడింది. ఇక కేంద్రం ఈ ప్రాంతంలో బీజేపీ ఎంపీలు గెలుస్తున్నా.. పెద్దగా దృష్టిపెట్టలేదు.

గతేడాది కొత్త ప్రతిపాదనతో..

కలగానే మిగిలిన రైల్వేలైన్‌పై గతేడాది అసెంబ్లీ ఎన్నికల వేళ మళ్లీ కదలిక మొదలైంది. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి గత సెప్టెంబర్ 5న పలు రైల్వేమార్గాలపై మాట్లాడుతూ ఆదిలాబాద్ నుంచి నిర్మల్, ఆర్మూర్, నిజామాబాద్, బోధన్, బాన్సువాడ, నిజాంపేట్, సంగారెడ్డి మీదుగా పటాన్‌చెరు వరకు రూ.5,706 కోట్ల వ్యయంతో దాదాపు 320కి.మీ. లైన్ నిర్మాణానికి ప్రణాళికసిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. మూడుద శాబ్దాల క్రితం ఇదేతరహాలో ఆదిలాబాద్, నిర్మల్, ఆర్మూర్, డిచ్‌పల్లి మీదుగా పటాన్‌చెరు వరకు రైల్వేలైన్ ప్రతిపాదన ఉంది. ఆ మార్గాన్నే మారుస్తూ తొమ్మిది నెలల క్రితం కేంద్రమంత్రి ప్రతిపాదించారు. ఇక ఈ నిర్మాణం రాష్ట్రంతో జాయింట్‌వెంచర్‌గా కాకుండా కేంద్రమే ప్రతిపాదించడం ఆసక్తికరంగా మారింది.

మన‘లైన్’లో మళ్లీ సర్వే..

గత సెప్టెంబర్‌లో కేంద్రం ఏదైతే పటాన్‌చెరు నుంచి ఆదిలాబాద్ రైల్వేలైన్ నిర్మాణాన్ని ప్రతిపాదించిందో ఆ మార్గంలో రైల్వే అధికారులు సర్వే చేయిస్తున్నారు. ఇటీవల సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు నుంచి కొంతదూరం మేరకు సర్వే చేశారు. ఇదేవిషయం వెలుగులోకి రావడంతో జిల్లావాసులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో బీజేపీకి ఎంపీలు, ఎమ్మెల్యేల సంఖ్య పెరిగింది. మరింతగా ఇక్కడ పట్టుసాధించడంలో భాగంగానైనా కేంద్రం ఈ రైల్వేలైన్‌నూ పూర్తిచేస్తుందన్న లెక్కలు ఉన్నాయి. ఈసారైనా రైల్వేలైన్ నిర్మాణం చేపట్టాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

మా గోడు ఆలకించండి..

- ప్రజావాణిలో బాధితుల విన్నపాలు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: భూ పట్టా చేయడం లేదని ఒకరు.. వసతిగృహంలో సీటు కావాలని మరొకరు.. ఉపాధి కల్పించాలని కొందరు.. పింఛన్ రావడం లేదని మరి కొందరు.. ఇలా జిల్లా నలుమూలల నుంచి ఆయా సమస్యలతో తరలివచ్చిన బాధితులు కలెక్టర్ రాజర్షిషా ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. పరిష్కారం చూపాలని వేడుకున్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు భారీగా తరలివచ్చారు. బాధితులు సమర్పించిన అర్జీలను కలెక్టర్ స్వీకరించి వాటిని సంబంధిత అధికారులకు అందజేశారు. వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో పాటు ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ వారం 100 అర్జీలు రాగా అందులో కొందరి నివేదన వారి మాటల్లోనే..



అర్జీదారుల సమస్యలను ఆలకిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

విరాసత్ పట్టా ఇవ్వడం లేదు



మా నాన్న గేడం సుధాం పేరిట గ్రామ శివారులోని సర్వేనంబర్ 28/3బి లో 3.1 ఎకరాల భూమి ఉంది. ఆయన పేరిట గత ప్రభుత్వం ధరణి పట్టా కూడా జారీ చేసింది. పెట్టుబడి సాయంతో పాటు ప్రభుత్వపరంగా ప్రయోజనాలన్నీ అందాయి. అయితే నాన్న మూడేళ్ల క్రితం చనిపోయాడు. ఆయన ఏకైక కుమారుడినైన నాకు ఆ భూమిని వారసత్వంగా పట్టా చేసి ఇవ్వాలని అప్పటి నుంచి మండల రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా. కానీ వారు పట్టించుకోవడం లేదు. విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరుతున్నా.

– గేడం దావు, కూర, జైనథ్

పరీక్ష రాసినా గైర్హాజరుగా చూపారు

మేమంతా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల విద్యార్థినులం. ఇటీవల నిర్వహించిన డిగ్రీ ఫైనలియర్ చివరి సెమిస్టర్‌కు సంబంధించి అన్ని పరీక్షలకు హాజరయ్యాం. కానీ ఫలితాల్లో తాము పరీక్షకు గైర్హాజరైనట్లుగా వెల్లడించారు. పీజీ విద్య కోసం ఇప్పటికే ఎంట్రెన్స్ పరీక్ష కూడా రాశాం. కానీ డిగ్రీ పరీక్షలకు గైర్హాజరుగా చూపడంతో ఉన్నత విద్య చదివే అవకాశం కోల్పోవల్సి వస్తోంది. మాకు న్యాయం చేసి విద్యాసంవత్సరం కోల్పోకుండా చూడాలని కోరుతున్నాం.

– డిగ్రీ కళాశాల విద్యార్థినులు, ఆదిలాబాద్



విద్యుత్ స్తంభాలు తొలగించాలి



మావల మండలం బట్టిసావర్‌గాం పంచాయతీ పరిధిలోని దుబ్బగూడ కాలనీలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఇళ్ల మధ్య నుంచి వెళుతున్నాయి. కొత్తగా ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు ఇబ్బందిగా మారుతోంది. వర్షాకాలం కావడంతో తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. వీటిని తొలగించాలని మావల ఏఈకి ఆరు నెలలుగా విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇబ్బందికరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించి సమస్యను పరిష్కరించాలి.

– ప్రభాకర్, బట్టిసావర్‌గాం, మావల

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

గుడిహత్నూర్: రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండల కేంద్రంలోని గ్రోమోర్ ఫర్టిలైజర్స్‌ను సోమవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పలు రికార్డులు, గోదాంలో నిల్వఉంచిన ఎరువుల బస్తాలను పరిశీలించా రు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి మోహన్,తహసీల్దార్ కవితారెడ్డి, ఎంపీడీవో అబ్దుల్‌హై, సహకార సూపరింటెండెంట్ ఆత్మారాం, సహకార సంఘం చైర్మన్ సంజీవ్ ముండే, ఏవో రేవతి తదితరులున్నారు.



గ్రోమోర్ గోదాంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

ఆంక్షలు లేకుండా పింఛన్ అందించాలి

కైలాస్‌నగర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం బీడీ కార్మికులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.4వేల పింఛన్ అందించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికులపై అనుసరిస్తు న్న అసంబద్ధ విధానాలు మానుకోవాలన్నారు. అ నంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశా రు. ఇందులో సంఘం నాయకులు, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో పెన్షనర్ల నిరసన..

పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ పెన్షన్‌దారుల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యసేవలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఈనెల 30న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద మౌన ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని పెన్షన్‌దారులు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

క్లుప్తంగా

బదిలీలకోసం ఉచిత ఆన్‌లైన్ సౌకర్యం

ఇచ్చోడ: పీఆర్‌టీయూ జిల్లా శాఖ తరపునుంచి ఐటీడీఏ ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించిన దరఖాస్తులకు ఉచితంగా ఆన్‌లైన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఆడేనూర్‌సింగ్ తెలిపారు. మండల కేంద్రంలోని రాజరాజేశ్వర్ వొకేషనల్ కళాశాలలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి ఈ అవకాశం కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఐటీడీఏ ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మద్రాస్ ఐఐటీకి ఎంపిక


సాయివంశీ

బోథ్: మండల కేంద్రానికి చెందిన మిర్యాల్కార్ సాయివంశీ మద్రాస్‌లోని ఐఐటీకి ఎంపికయ్యాడు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు చదివిన సాయివంశీ మద్రాస్ యూనివర్శిటీలో ఐఐటీలో డాటాసైన్స్ విభాగంలో సీటు సంపాదించాడు. ప్రిన్సిపాల్ ఎం.ఉమేష్ రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

గుట్కా పట్టివేత


గుట్కాతో ఎస్సై సక్రియ నాయక్

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామ శివారులో సోమవారం నిషేధిత గుట్కా పట్టుకున్నట్లు ఎస్సై సక్రియ నాయక్ తెలిపారు. భైంసా పట్టానికి చెందిన అబ్దుల్ నయిం బైక్‌పై లోకేశ్వరంకు గుట్కా ప్యాకెట్లు తరలిస్తుండగా తమకు అందిన పక్కా సమాచారం మేరకు పుస్పూర్ గ్రామ సమీపంలో పట్టుకున్నారు. గుట్కా విలువ రూ.25 వేలు ఉంటుందన్నారు. గుట్కాను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నిషేధిత పొగాకు పట్టివేత


పొగాకుతో ఎస్సై విష్ణువర్ధన్

ఆదిలాబాద్‌రూరల్: నిషేధిత పొగాకు ఉత్పత్తులను మావల పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన కంటైనర్ డ్రైవర్ మహ్మద్ ఆజీం, క్లీనర్ మహ్మద్ తరిఫ్ ఢిల్లీ నుంచి ఆదిలాబాద్‌కు నిషేధిత పొగాకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. పొగాకు విలువ రూ.16 లక్షలు ఉంటుందన్నారు. కంటైనర్ డ్రైవర్, క్లీనర్‌తో పాటు అస్లాం ట్రేడర్‌కు చెందిన షేముపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గొల్లపేటలో సోమవారం వరలక్ష్మి అనే గృహిణి ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధమైంది. గమనించిన స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. సుమారు లక్ష రూపాయల విలువ గల సామగ్రి బుగ్గిపాలైనట్లు జిల్లా ఫైర్ అధికారి జయత్‌రామ్, సిబ్బంది హుస్సేన్, అజయ్ కుమార్, రాజు తెలిపారు.

కళాశాలనే కదిలించారు..

- ఉద్యోగుల తప్పుడు సమాచారం.. అధికారుల నిర్ణయం
- ఇచ్చోడ మహిళా డిగ్రీ కళాశాల ఆదిలాబాద్‌కు మార్పు
- అద్దె రూ.4 లక్షల అదనపు భారం..
- కొంతమంది కోసం గుట్టుగా నిర్ణయం..
- వసతులు లేని భవనంలోకి మార్చడంపై విమర్శలు


ఇచ్చోడలో కొనసాగిన మహిళా డిగ్రీ కళాశాల భవనం

ఇచ్చోడ: ఏడేళ్లుగా ఇచ్చోడ మండల కేంద్రంలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను గుట్టుచప్పుడు కాకుండా ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి తరలించుకుపోయారు. 2017లో జిల్లాకు సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల మంజూరైంది. అప్పట్లో జిల్లా కేంద్రంలో కళాశాలను కొనసాగించడానికి ప్రభుత్వ భవనాలు లేక పోవడంతో అధికారులు ఇచ్చోడ మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ బిల్డింగ్‌ను అద్దెకు తీసుకుని కళాశాలను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు ఇచ్చోడ మండల కేంద్రం మధ్యలో ఉండటంతో పాటు మెరుగైన రవాణా సౌకర్యం ఉండటంతో ఇక్కడి కళాశాలలో అడ్మిషన్లకోసం విద్యార్థులు పోటీ పడేవారు.

ప్రభుత్వంపై ఆర్థిక భారం..

ఇచ్చోడ మండల కేంద్రంలో కొనసాగిన కళాశాల ప్రశాంత వాతావరణంలో ఆధునికమైన భవనంతో పాటు, విద్యార్థులకు విశాలమైన ఆటస్థలం ఉండేది. అద్దెకూడా నెలకు రూ.లక్షా 25 వేలు మాత్రమే ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం అక్కడ అద్దె నెలకు రూ.5 లక్షలు చెల్లిస్తున్నట్లు సమాచారం. దీంతో నెలకు రూ.4 లక్షల అదనపు అద్దెతో ప్రభుత్వంపై ఆర్థికభారం కూడా పడుతోంది. అంతేకాకుండా సరైన గదులు, డార్మెంటరీ, ఆటస్థలంలేవని ఆరోపణలు ఉన్నాయి. కళాశాల పక్కనే రైల్వేస్టేషన్ ఉండడంతో విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై ప్రిన్సిపాల్ ప్రభుజ్యోతిని వివరణ కోరగా ఆదిలాబాద్ కళాశాల కావడంతో అక్కడికి తరలించినట్లు తెలిపారు. కళాశాల తరలింపుపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

తప్పుడు సమాచారం...

ఇక్కడి కళాశాలలో పనిచేసే కొంత మంది ఉద్యోగులు సంబంధిత ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి ఇక్కడి నుంచి ఆదిలాబాద్‌కు తరలించడానికి ప్రత్యేకంగా చొరవ చూపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు సైతం తరలింపుపై స్థానిక నాయకులు, విద్యార్థుల అభిప్రాయాలు తీసుకోకుండానే కళాశాల తరలింపు నిర్ణయం తీసుకోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఆదిలాబాద్ నుంచి ఇచ్చోడకు రాకపోకలకు సిబ్బందికి ఇబ్బందులు కలగడంతోనే కళాశాలను ఆదిలాబాద్‌కు తరలించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెరుగైన వసతులు ఉన్న ఇచ్చోడ కాకుండా ఆదిలాబాద్‌లో అరకొర వసతులు ఉన్న అద్దె భవనానికి కళాశాల తరలించడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

స్పోర్ట్స్ స్కూల్ డిప్యూటేషన్లు రద్దు

- విద్యాశాఖ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం
- మళ్లీ దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశం



'సాక్షి'లో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్

ఆదిలాబాద్‌టౌన్: స్పోర్ట్స్ స్కూల్‌లో డిప్యూటేషన్లు రద్దు చేయాలని డీఈవో ప్రణీతను కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. 'స్పోర్ట్స్'కు ..పైరవీలు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. డీటీఎఫ్ నాయకులు వృకోదర్ సోమవారం ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా విద్యాశాఖ అధికారులను పిలిపించి వివరాలు తెలుసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్పోర్ట్స్ స్కూల్‌లో డిప్యూటేషన్లు ఉండడంతో వాటిని రద్దు చేశారు. ఒకే సబ్జెక్టుకు సంబంధించి ఇద్దరేసి ఉపాధ్యాయులను ఏవిధంగా ఎంపిక చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ రీనోటిఫికేషన్ ఇవ్వాలని, ఈ ప్రక్రియను అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి సమక్షంలో చేపట్టాలని ఆదేశించారు. ఒక పోస్టుకు సంబంధించి ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ ద్వారా ఎంపిక చేయాలని సూచించారు.

స్పౌజ్ అవకతవకలపై కమిటీ..

'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత స్పందించారు. 'ఉపాధ్యాయ బదిలీల్లో నిబంధనలకు తూట్లు.. స్పౌజ్ పనిచేసే చోట కాకుండా అనుకున్న బడి ఎంపిక' అనే కథనం ప్రచురితమైంది. ఆరుగురు ఎంఈవోలతో కమిటీ వేశారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో ఆయా మండలాల స్పౌజ్ ఉపయోగించుకున్న ఉపాధ్యాయుల దరఖాస్తులను పరిశీలించనున్నారు. నిబంధనలు అతిక్రమించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోనున్నారు.

జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చాలి


ఎంపికైన క్రీడాకారులతో పీవో

ఉట్నూర్‌రూరల్: జాతీయ స్థాయి జూనియర్ హాకీ పోటీల్లో పాల్గొనే ఉట్నూర్ గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులను సోమవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా ఘనంగా సన్మానించారు. ఎంపికైన వారిలో పూసం మోతీరాం, చౌహాన్ సాయిరాం, ఆత్రం జగ్జీవన్, జాదవ్ చరణ్, ఆత్రం శంభు, రాథోడ్.ధన్‌రాజ్ ఉన్నారు. ఈ నెల 19 నుంచి 29 వరకు కేరళ రాష్ట్రంలోని కొల్లాంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో డీడీ దీప్‌కుమార్, ఏపీవో ఆత్రం భాస్కర్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, కోచ్ సునంద్, తదితరులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసి.. భర్త ఆత్మహత్యాయత్నం


భార్య సునీతను గొంతు కోసి తన గొంతు పొడ్చుకున్న లక్ష్మణ్


విలపిస్తున్న కుమారులు

- అనుమానమే పెనుభూతమై..
- ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో ఘటన


సునీత (ఫైల్)


నిందితుడు లక్ష్మణ్

బేల: అనుమానమే పెనుభూతమై భార్యను హత్య చేసి భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో సోమవారం చోటు చేసుకుంది. దంపతుల మధ్య చోటు చేసుకున్న గొడవల నేపథ్యంలో కత్తితో ఆమె గొంతుకోశాడు. ఈ ఘటనలో ఎల్చల సునీత(28) అక్కడికక్కడే మృతి చెందగా, భర్త లక్ష్మణ్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బోరిగాంకు చెందిన సునీత, సైద్‌పూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ తొమ్మిదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. సాఫీగా సాగుతున్న వీరి కుటుంబంలో భార్యపై అనుమానం కారణంగా దంపతుల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఆమె కొంత కాలం క్రితం పిల్లలను వెంట తీసుకొని తన తల్లిగారింటికి వెళ్లిపోయింది. పోలీస్‌స్టేషన్‌లో పలుమార్లు ఇద్దరికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినా తీరు మారకపోవడంతో ఆమె విడిపోయేందుకు సిద్ధపడింది. ఈ క్రమంలో సోమవారం సైద్‌పూర్‌లో కుమారులు చదువుకునే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వచ్చి, అనంతరం పిల్లల దుస్తులు తీసుకెళ్లేందు కోసం ఇంటికి వెళ్లింది. అక్కడే ఉన్న భర్త మద్యం మత్తులో ఆమెతో గొడవపడ్డాడు. ఆవరణలో కూరగాయలు కోసే కత్తితో సునీత గొంతు మూడు సార్లు కోశాడు. అనంతరం తన గొంతులోనూ పొడ్చుకున్నాడు. సునీత అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటన స్థలానికి చేరుకున్న స్థానికులు, పోలీసులు అతడిని 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. సంఘటన స్థలాన్ని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం పరిశీలించారు. మృతురాలి తండ్రి వసంత్‌రావు ఫిర్యాదు మేరకు లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. తల్లి లోకాన్ని విడిచివెళ్లగా.. తండ్రి పోలీసుల అదుపులోకి వెళ్లడంతో ఇద్దరు కుమారులు అనాథలుగా మారారు. మృతదేహం వద్ద వారు విలపించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది.

స్నేహితులను కలిపిన బడి..!

- ప్రతీరోజు పాఠశాలలో పండగ వాతావరణం
- 54 ఏళ్ల పూర్వ విద్యార్థుల కలయిక



డిస్మెంటల్ చేయనున్న కుంటాల ఉన్నత పాఠశాల



2010-11 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

కుంటాల: ఆ బడికి 54 ఏళ్ల చరిత్ర ఉంది. అప్పటి విద్యార్థులను కలిపే వేదికగా మారింది. కుంటాల ఉన్నత పాఠశాలను1970లో నిర్మించారు. ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకు విద్యార్థులు చదివేందుకు అవకాశం కల్పించారు. గత ప్రభుత్వం మనఊరు–మనబడి పథకంలో భాగంగా రూ.కోటి 53 లక్షల నిధులు వెచ్చించి నూతన భవనాన్ని నిర్మించారు. పాత భవనాన్ని కూల్చేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు పాత బడిలో ప్రతిరోజు సమ్మేళనాన్ని నిర్వహించడంతో బడిలో పండగ వాతావరణం నెలకొంటోంది. పాఠశాల పాత భవనం శిథిలావస్థకు చేరడంతో కూల్చివేసేందుకు చర్యలు చేపడుతున్నారు. 1970 నుంచి 2023 వరకు ఆపాఠశాలలో చదివిన విద్యార్థులు తామంతా కలవాలని నిశ్చయించుకున్నారు. నెల రోజుల నుంచి పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరిట పిల్లాపాపలతో కలిసి 54 ఏళ్ళ కింద బడిలో ఓనమాలు దిద్దిన విద్యార్థులు కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటున్నారు. దేశ విదేశాల్లో ఉన్న విద్యార్థులు ఒకేచోట కలిసి మధుర స్మృతులను నెమరు వేసుకుంటున్నారు.

అబుదాబీ నుంచి వచ్చా



నేను కుంటాల ఉన్నత పాఠశాలలో 2008లో పదో తరగతి పూర్తి చేశా. స్నేహితులు ఫోన్ చేయడంతో అబుదాబీ నుంచి వచ్చాను. అందరితో సంతోషంగా గడిపా.
– జక్కని కిరణ్, పూర్వ విద్యార్థి, అబుదాబీ

32 ఏళ్ల తర్వాత కలుసుకున్నాం



నేను 1993లో పాఠశాలలో పదోతరగతి పూర్తిచేశా. చదువుకున్న పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించడంతో 32 ఏళ్ల తర్వాత కలుసుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చింది. పిల్లాపాపలతో, గురువులతో కలవడం అదృష్టంగా భావిస్తున్నా.
– సీహెచ్.సునంద, పూర్వ విద్యార్థి, నిజామాబాద్

నేనూ పూర్వ విద్యార్థినే..



పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరిట పాఠశాలకు ఆహ్వానించారు. నేను ఇదే పాఠశాలలో చదివి పాఠాలు బోధించడం ఆనందంగా ఉంది. తరగతి గదిలో బోధించిన పాఠాలు గుర్తుకొచ్చాయి. ఎన్నో ఏళ్ల నుంచి చదివిన విద్యార్థులు సమ్మేళనం పేరిట కలవడంతో పండగ వాతావరణం నెలకొంది. – జి.రమేశ్‌గౌడ్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

విద్యుత్ షాక్‌తో ప్లంబర్ మృతి


సంఘటన స్థలంలో మృతదేహం

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన ప్లంబర్ శ్రీకరణ్ (23) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం... పొచ్చెర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా మూత్ర శాలలు, మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. మూత్రశాలలకు నీటి ట్యాంకుతో పాటు పైప్‌లైన్ నిర్మించడానికి శ్రీకరణ్‌తో పాటు ఆయన తండ్రి చెమ్మన రాజేందర్ సోమవారం పనులు నిర్వహిస్తున్నారు. ట్యాంకును మూత్రశాలపై ఎక్కించేందుకు పైకి ఎక్కిన శ్రీకరణ్‌కు మూత్రశాలపైన ఉన్న 11కెవి విద్యుత్ వైర్లు తాకడంతో షాక్‌కు గురై మృతిచెందాడు. మృతుని తండ్రి రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువకుడు..

బోథ్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాము తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన వనపత్రి రాము (28)కు నాలుగేళ్ల క్రితం నిజామాబాద్‌కు చెందిన ఓ యువతితో వివాహమైంది. పెళ్లైన ఏడాదికే విడాకులయ్యాయి. దీంతో మనస్తాపానికి గురై సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుని తండ్రి దత్తు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందుతాగి ఆత్మహత్య

గుడిహత్నూర్: పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురుజ గ్రామానికి చెందిన కొల్లూరి తరుణ్ (21)కు గతేడాది మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన దీవెనతో వివాహం జరిగింది. ట్రాక్టర్ కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. రోజూ మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. ఆదివారం సాయంత్రం కూడా అతిగా మద్యం సేవించి మద్యం మత్తులో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. తరుణ్‌కు భార్యతో పాటు 3 నెలల చిన్నారి ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

మనస్తాపంతో యువకుడు బలవన్మరణం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన జక్కుల పవన్ కళ్యాణ్ (21) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. గ్రామానికి చెందిన జక్కుల ఆశన్న పెద్ద కుమారుడు పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తుండగా రెండురోజుల క్రితం ఇంటికి వచ్చాడు. పెళ్లి చేసుకుని ఇక్కడే ఉండమని తల్లిదండ్రులు కుమారుడికి నచ్చజెప్పారు. వ్యవసాయం చేయడం ఇష్టంలేదని, హైదరాబాద్‌కు వెళ్తానని చెప్పడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన పవన్ ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఊశన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంద్రనగర్‌లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఇంద్రనగర్‌లో గల ఓ ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. కాలనీకి చెందిన భరత్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్రలోని నాందేడ్‌కు వెళ్లాడు. మధ్యాహ్నం వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగిలి ఉంది. ఇంట్లో ఉన్న రూ.3వేల నగదుతో పాటు తులం బంగారం అపహరణకు గురైనట్లు బాధితుడు టూటౌన్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం ఉదయం పంజాబ్ చౌక్‌లోని ఓ వైన్స్‌షాప్ వద్ద మద్యం సేవిస్తున్న క్రాంతినగర్‌కు చెందిన విష్ణుచంద్ పోలీసులను చూసి పరారయ్యాడు. అనుమానం వచ్చిన పోలీసులు పట్టుకొని విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి రూ.2,500 నగదు రికవరీ చేసినట్లు సీఐ కరుణాకర్ రావు తెలిపారు.

ఖేలో ఇండియా పోటీల్లో రాణించాలి


టీంతో సీఎం రేవంత్‌రెడ్డి

ఖానాపూర్: ఖేలో ఇండియాలో ఎన్నికైతే స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ కోచ్‌గా అవకాశం కల్పిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఖేలో భారత్ పోటీల్లో పిస్టల్ అండ్ రైఫిల్ షూటింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన గుగ్లావత్ సురేందర్‌నాయక్ తెలిపారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని సీఎం కార్యాలయంలో టీం సభ్యులతో సీఎంను కలిసి పోటీలు జరిగిన తీరును విన్నవించారు. కోచ్‌గా శిక్షణ ఇస్తూ క్రీడాకారుడిగా పోటీల్లో రాణించడం అభినందనీయమని సీఎం అభినందించారని సురేందర్ తెలిపారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని చందునాయక్‌తండాకు చెందిన గుగ్లావత్ కళాబాయి–బలిరాం దంపతుల కుమారుడు సురేందర్ ఖేలో భారత్ పోటీల్లో పిస్టల్ అండ్ రైఫిల్ షూటింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. త్వరలో జరుగనున్న ఖేలో ఇండియా పోటీలకు సైతం ఎంపిక కాగా అందుకు సంబంధించిన సెలెక్షన్ త్వరలో ఉండనున్నట్లు పేర్కొన్నాడు.

కుభీర్‌లో చోరీ

కుభీర్: మండల కేంద్రంలోని కానోబాగల్లిలో ఆదివారం రాత్రి మార్కెట్ కార్యదర్శి గంగాధర్ అద్దె ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కంజర్లలో ఉన్న తమ బంధువు చనిపోయాడని తెలియడంతో ఆదివారం ఉదయం గంగాధర్ దంపతులు కంజర్ల కు వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి హోండా షైన్ బైక్ కనిపించకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై ఎస్సై పి.రవీందర్ ను ప్రశ్నించగా చోరీ జరిగినట్లు ఫోన్ చేశారు. ఇంకా ఫిర్యాదు అందలేదని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వంతోనే అభివృద్ధి

- ఎంపీ గోడం నగేశ్


మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్

ఇంద్రవెల్లి: కేంద్ర ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా కేస్లాపూర్ నాగోబాను దర్శించుకున్నారు. మెస్రం వంశీయులతో కలిసి నాగోబా ఆలయ పరిసర ప్రాంతంలో మొక్కలు నాటారు. అనంతరం ఆత్మీయ సన్మానసభలో మండల శాఖ ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ గతంలో తాను మంత్రి, ఎంపీగా ఉన్నప్పుడే జిల్లాతో పాటు ఇంద్రవెల్లి మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, జిల్లా ఉపాధ్యక్షుడు సిడాం భీంరావ్, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి


అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇంద్రవెల్లి మండలం సాలెగూడకు చెందిన హన్మంతు విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయించాలని, కాసిపేట మండలం మల్కపల్లి గ్రామానికి చెందిన శశికళ ఇల్లు కావాలని, ఉట్నూర్‌కు చెందిన మంగ దేవన్న చికిత్స కొరకు ఆర్థికసాయం అందించాలని, కుమ్మరితాండకు చెందిన మనికుమార్ గేదెల కోసం రుణం మంజూరు చేయించాలని, ఆదిలాబాద్ మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన సాయికృష్ణపై చదువుల కొరకు ఆర్థికసాయం అందించాలని కోరారు. ఏపీవో కనక భీంరావు, జీసీసీ మేనేజర్ రామానందస్, అదనపు వైద్యాధికారి మనోహర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, ఏవో రాంబాబు, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈఎంఆర్‌ఎస్‌ను సందర్శించిన వైద్యాధికారులు

నార్నూర్: శ్వాసకోశ సమస్యతో ఈఎంఆర్‌ఎస్ విద్యార్థినులు అస్వస్థతకు గురై ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి మనోహర్, రిమ్స్ వైద్య బృందం సోమవారం పాఠశాలను సందర్శించి ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం రిమ్స్ సైకాలజిస్టుతో అవగాహన కల్పించారు. వైద్యాధికారి మనోహర్ మాట్లాడుతూ స్థానికంగా ఉండే కొంతమంది విద్యార్థులకు మాత్రమే మూడేళ్లుగా శ్వాసకోశ సమస్య వస్తుందని నిర్ధారించామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఈ సమస్య లేదన్నారు. అపోహలు వీడి క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన సమస్యలు వస్తే స్థానికంగా ఉండే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహిస్తామని, ధైర్యంగా ఉండాలని విద్యార్థినులకు మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో రిమ్స్ వైద్య బృందం రఘునాథ్, వెంకట భార్గవ్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.